



మనస్సు మహోధృత జలపాతంలా ఉంది. వేణు కాలు ఒకదగ్గర నిలపడం లేదు. దీనికి కారణం తెలియాలంటే మూడు రోజుల ముందుకు వెళ్లాలి. అతని ఊహాలోకమేదో కనుల ముందు సాక్షాత్కరించినట్లుంది. తన చిరకాల కోరిక నెరవేరబోతున్నట్లనిపించింది కూడా. పలకరించడం మామూలుగా పలకరించడం కాదు.

"ఇన్నాళ్ళు ఎక్కడున్నావు, వేణూ!" అని అడిగింది. అలా అడగడం "ఇన్నాళ్ల నన్ను ఎలా వదిలి ఉన్నావు, వేణూ" అని అడిగినట్లనిపించింది. ఆమె కోసమేనేమో తానింకా పెళ్ళి చేసుకోలేదు అని అనుకున్నాడు. వీణతో తనకు పరిచయం మామూలుగానే జరిగింది. చాలా మందిది పరిచయం అయినట్లుగానే అయింది. కానీ అనతి కాలంలోనే చాలా దగ్గరయినట్లు అనిపించింది. తానే అట్లా ఫీలవుతున్నానేమో. వీణ అలా ఫీలుకావడం లేదేమో అని చాలాసార్లు అనుకున్నాడు. ఎందుకు ఫీల్ కాదు అని సమాధానపర్చుకున్నాడు. కానీ ఆమె చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయినపుడు తాను ఆమె గురించి అనుకున్నదంతా భ్రమ మాత్రమేనని విచారపడ్డాడు.

తాను పదో తరగతిలో ఉన్నపుడు తమ స్కూల్‌కు బదిలీ అయి వచ్చాడు రంగాచారి అనే తెలుగు టీచర్. వచ్చిన వాడు ఒంటరిగా రాకుండా తన కూతురు వీణను తీసుకువచ్చాడు. ఆమె కూడా తన క్లాసే. ఆ అమ్మాయి చదువులో చాలా చురుకు అని వచ్చిన కొద్ది రోజులకే తెలిసింది. ఆమె కారణంగా వేణు క్లాస్ ఫస్టు ర్యాంక్ పోయింది. దాంతో చదువులో తనకు ఆమెకు పోటీ ప్రారంభమయింది. తాను మొండికేసి చదవడంతో క్లాస్ ఫస్టు దక్కించుకోగలిగాడు. కానీ అది ఎల్లవేళలా కొనసాగలేదు. ఒక్కసారి తాను ఫస్టు వస్తే, మరోసారి ఆమె ఫస్టు వచ్చేది. దీంతో పోటీ మరింత ఉధృతమైంది. దీంతో తాను కోపంతో ఊగిపోవడం, వీణ ఏవేవో వ్యంగ్యంగా వెక్కిరించడం ప్రారంభించింది. తన మాటల ద్వారా ఆమెను ఉడికించాలని, ఆమెను రెచ్చగొట్టాలని చూసేవాడు. కానీ ఆమె మనస్సులో ఏమనుకునేదో గానీ నోరు తెరిచి ఏనాడూ తనను ఒక్క మాటా అనలేదు. ఇది ఆమె సంస్కారానికి నిదర్శనమని పెద్ద పెరిగాక అర్థమైంది. అది అర్థం చేసుకునేసరికి చేయి దాటిపోయినట్లనిపించింది. ఎందుకోగానీ రంగాచారికి ఈ ఊళ్లో ఉండడం ఇష్టం లేదట. వచ్చిన తెల్లారి నుంచి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం మొదలు పెట్టాడట. అదృష్టం బాగుండి చాలా త్వరగా కోరిక ఫలించిందట. అందరూ అనుకుంటుంటే వేణుకు ఈ విషయాలూ తెలిశాయి. తెలిసే సరికే రంగాచారి వెళ్ళిపోవడం, అతనితో పాటు వీణ వెళ్ళి పోవడం జరిగాయి. అతను వెళ్ళిపోయాక గానీ తనకు తెలియదు. తనకు తెలియకూడదని వీణ అనుకుందా అని కూడా అనుకున్నాడు. కానీ అలా అనుకోవడంలో అర్థం లేదని తన క్లాస్‌మెట్స్ మాటలను బట్టి తెలిసింది. వాళ్ళకు కూడా తెలియదట.

స్కూల్‌కు వెళ్తున్నాడన్నమాటే గానీ వేణు మనస్సు మనస్సులో లేదు. వీణ వెళ్ళిపోయాక జీవితంలో ఏదో వెలితి ఏర్పడినట్లనిపించింది. తనకు చదువులో ఇక పోటీ లేదు. కానీ ఆ ఫస్టు ర్యాంక్ మీద ఇపుడు అతనికి మమకారం కూడా లేకుండా పోయింది. ఏదో విలువైన దాన్ని పోగొట్టుకున్నట్లనిపించింది. ఎంతో హుషారుగా ఉండే వేణు ముభావంగా మారిపోయాడు. ఎపుడూ ఏదో ఆలోచిస్తూ కాలం గడిపేవాడు. ఎవరైనా పలకరిస్తే పొడిపొడిగా మాట్లాడేవాడు. వేణులో వచ్చిన మార్పేమిటో, ఎందుకా మార్పు వచ్చిందో మిత్రులకు అర్థం కాలేదు. బహుశా వేణుకు కూడా ఇపుడు తిరిగి వీణ కలిసే వరకు అర్థం కాలేదేమో. మూడు రోజుల క్రితం ఆమె కనిపించినపుడు పదేళ్ళ క్రితం తాను కోల్పోయినదేమిటో తిరిగి పొందినట్లనిపించింది.

ఆర్ట్స్ కాలేజీ నుంచి బయటకు వస్తుంటే ఎదురైంది. తాను గుర్తుపట్టలేదు. ఆమె గుర్తు పట్టి "మీరు వేణు కదూ !" అంది. తాను కాస్తా తడబడుతూ "అవును" అన్నాను.

"నన్ను గుర్తుపట్టలేదు కదూ!" అంది. గలగలనవ్వింది.

'ఎట్లా గుర్తు పడ్తారు లెండి, మనం విడిపోయి పదేళ్ల దాటిందనుకుంటా" అంది ఆమే. తాను గుర్తు తెచ్చుకోవడానికి చాలా ప్రయత్నించాడు. ఎంతకూ గుర్తుకు రాలేదు. చాలా నామోషీగా కూడా ఫీలయ్యాడు. ఒక అమ్మాయి ఎదురుపడి "నన్ను గుర్తు పట్టావా" అని అడిగితే లేదని తెల్ల మొహం వేయడం చాలా సిగ్గుమాలినతనమని అనుకున్నాడు.

"ఎందుకు తంటాలు, మీరు గుర్తుపట్టలేరు లెండి" అని గలగలా నవ్వేసింది. వేణు ముఖం మాడిపోయింది.

"వయస్సుతో పాటు మగవాళ్ళు పెరగరు. అందుకని వారిని గుర్తు పట్టడం తేలిక అని మరోసారి నవ్వింది. మీరు దీన్నేం సీరియస్‌గా తీసుకోకండి. నవ్వులాటకు అన్నాను. పదేళ్ళ క్రితం మీరు ఎట్లా ఉన్నారో ఇవాళ్ళా అట్లాగే ఉన్నారు". ఆర్ట్స్ కాలేజీ మెట్ల మీద నిలబెట్టే మాట్లాడేస్తోంది. "నేను చాలా మారాను. ఆడవాళ్ళలో మార్పు సహజం లెండి" అంది. "అందుకే నన్ను గుర్తించలేకపోయారు. గుర్తించలేరు కూడా". ఈ చివరి మాట అంటున్నపుడు ఆమె తనను సవాల్ చేసినట్లు అనిపించింది.

తాను ఓడిపోయినట్లు కూడా ఆమె తీర్పు చెప్పినట్లు అనిపించింది. తట్టుకోలేకపోయాడు.. ముఖం కందగడ్డలా మారిపోయింది. అమ్మాయి చూస్తే అత్యంత సౌందర్యవతేం కాదు గానీ, ఏదో కళ్ళను కట్టిపడేసే ఆకర్షణ మాత్రం ఉంది. అందుకేఆమె అట్లా మాట్లాడుతున్నా నిలబడ గలిగాడు. వేరే వాళ్ళయితే పక్కకు తప్పుకొని వెళ్ళిపోయేవాడే.

"నిన్ననా, మొన్ననా ? మన పరిచయం పదేళ్ళ కిందటిది. పదేళ్ళు నాలో మార్పు ఎంతో వచ్చి ఉంటుంది. ఎప్పుడూ చిన్నపిల్లలుగానే ఉండడం సాధ్యం కాదు కదా!" అంది చివరి మాట అంటున్నపుడు ఎపుడూ అలాగే ఉండిపోతే బాగుండుననే కోరిక ఉన్నట్లనిపించింది. "మీరెవరో చంపకుండా చెప్పేయండి" అని అడుగుదామనుకున్నాడు. కానీ అడగనిచ్చేలా లేదు అనే కన్నా ఆమె అలా మాట్లాడుతుంటే చూస్తూ ఉండడం ఎంతో బాగుంది. "ఇంకా గుర్తు పట్టలేదు కదూ !" అంది 'గుర్తుపట్టరు లెండి" అని మళ్ళీ తానే అంది.

"ఒక్కసారి మళ్ళీ స్కూల్‌డేస్‌కు వెళ్ళిపొండి" అంది "వెళ్ళి పోయారా ? అని అడిగింది. "ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళడం అలా కాదండి, కళ్ళు మూసుకుని వెళ్ళాలి" అంది. దాంతో వేణు చాలా మొహమాటపడ్డాడు. "ఫరవాలేదు. కళ్ళు మూసుకోండి" అని పురమాయించింది. అందరూ తమనే గమనిస్తున్నారేమోనని అనిపించింది. కాస్త సిగ్గు పడ్డాడు కూడా. అది గమనించినట్లుంది.

"సిగ్గుపడాల్సిన పనేం లేదు. అర్జంట్‌గా కళ్ళు మూసేసుకోండి" అంది.

ఈ అమ్మాయి ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టేలాగుందే అని అనుకున్నాడు. సిగ్గుపడుతూ కళ్ళు మూసుకున్నాడు. వెంటనే తెరిచాడు. "నేనెవరో గుర్తొచ్చానా" ? అని అడిగింది. అడ్డంగా తలూపాడు. "అవును, నేను గలగలా మాట్లాడేస్తున్నాను. మీరేం మాట్లాడరేమిటి?" అని సందేహం వ్యక్తం చేసింది. " అయినా నేనెవరో తెలియకుండా మీరేం మాట్లాడుతారు లెండి" అని తానే సందేహనివృత్తి చేసుకుంది.

"మీరు నన్ను గుర్తించలేరుగానీ నేనేం చెప్తాను. నాకేం బహుమతి ఇస్తారో చెప్పండి" అని అడిగింది. వేణు మాట్లాడలేదు. "చెప్పండి సార్"! అంది.

"ఏం కావాలో చెప్పండి " అని అన్నాడు.

"నేనేం మణులు, మాణిక్యాలు అడగను" అంది.

కాస్త ధైర్యం చేసి, "మీరు అడగాలే గానీ ఇవ్వనా ?" అని అన్నాడు.

"మీరు కూడా సరదాగా మాట్లాడగలరే !" అంది. అలా అంటున్నపుడు ఆమె కింది పెదవి బాణంగా వంగింది.

వేణు నవ్వాడు.

ఇంతలో ఓ అమ్మాయి వచ్చి ఏమిటే ఇంకా ఇక్కడే వున్నావు ? " పెనుగాలిలా వచ్చి పడింది.

"చిన్ననాటి నా మిత్రుడు కలిస్తే మాట్లాడుతున్నా, పదేళ్ళ తరువాత కలిశాం ఆ మాత్రం మాట్లాడకూడదా ! పైగా నేనంటే ఆయనకు మహా ఉడుకుమోతు. చిన్నప్పుడు నన్ను ఏడిపించాడు. ఇవాళ దానికి ప్రతీకారం తీర్చుకున్నాలే. ఆయన నన్ను ఆరు నెలలు ఏడిపించినంత నేను ఒక గంటలో ఏడిపించగలిగాను. అదీ నా ప్రతిభ" అంది.

ఈ మాటలతో లీలగా ఆమె గుర్తు రావడం ప్రారంభమైంది వేణుకు.

" మా ఫ్రెండ్ వచ్చింది కాబట్టి మిమ్ముల్ని ఇంతటితో వదిలేస్తున్నా" అంది.

"ఇప్పుడైనా నేనెవర్నో గుర్తించారా ?" అని అడిగింది.

"కొంచెం టైమ్ ఇస్తే చెప్పగలను" అని అన్నాడు.


"మీరేం మైండ్ చెడగొట్టుకోనవసరం లేదు. నేను చెప్పేస్తా, దానికి మీరేం బహుమతి ఇవ్వనక్కర్లేదు' అంది.

వేణు మాట్లాడలేదు.

" నా పేరు వీణ, పదో తరగతిలో ఆరు నెలలు మాత్రమే మీతో చదువులో పోటీ పడే అవకాశం లభించింది. ఆ తర్వాత మా తండ్రిగారితో పాటు వేరే ఊరికి వెళ్ళిపోవడం వల్ల నేను అవకాశాన్ని కోల్పోయాను అని అంటూ "నేను వెళ్తా, పదవే!" అంటూ ముందుకు కదలబోతోంటే 'ఏమండీ ! మిమ్ముల్ని కలవడం ఎలా ?" అని అడిగాడు. ఆమె నిలబడి "కలవాలని మీరూ ఉత్సాహపడుతున్నారన్నమాట" అంది. ఆ మాట అన్నపుడు ఆమె కూడా తనను కలవాలని తహతహలాడుతున్నదని వేణు అర్థం చేసుకున్నాడు. అతను మాట్లాడలేదు.

'ఈ అడ్రస్‌కు రండి' అంటూ విజిటింగ్ కార్డు హ్యాండ్ బ్యాగ్‌లోంచి తీసి ఇచ్చింది. ఆ తర్వాత తీయని ఊహలతో వేణు హాస్టల్‌కు వెళ్ళిపోయాడు. అది మొదలు అతని మనస్సు గాలిలో తేలడం ప్రారంభించింది. ఊహా ప్రపంచంలో తేలిపోతూ నిద్రపోవడం మానేశాడు. మూడు రోజులుగా ఎప్పటికప్పుడు వెళ్దామనే అనుకుంటున్నాడు. కానీ ఎందుకో వెళ్ళడం లేదు.

మళ్లీ బాపు




* * *

వేణు గుండె అల్లకల్లోలమైంది. చిరాకుగా కూడా ఉంది. మనస్సరోవరాన్ని చీకటి ఆవరించినట్లనిపించింది. గత మూడు రోజులుగా నిద్రపట్టడం లేదు. సిగరెట్ల మీద సిగరెట్లు కాల్చి పడేస్తున్నాడు. అర్ధరాత్రి లేచి గదిలో పచార్లు చేస్తున్నాడు. మాటిమాటికీ ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళి మంచినీళ్ళు తాగుతున్నాడు. అతను అలా పచార్లు చేస్తున్నపుడో, సిగరెట్ కాలుస్తున్నపుడో, మంచినీళ్ళు తాగుతున్నపుడో గమనిస్తే 'ఏమిటండీ ! మీరింకా నిద్రపోలేదా ?' అని అడిగి భార్య మళ్ళీ కళ్ళు మూసుకుంటోంది. తాను అశాంతితో రగిలిపోతుంటే ఆమెకు చీమకుట్టినట్లయినా లేదు అని చాలాసార్లు మౌనంగానే విసుక్కున్నాడు కూడా. 'తనను ఒడిలోకి తీసుకుని సేద తీర్చాలనే పట్టింపు కూడా ఆమెకు లేదు అని అనుకున్నాడు. వీణనే గనుక తాను పెళ్ళి చేసుకుని ఉంటే తన గుండె ఇలా మండిపోతున్నపుడు గమనించి తనను దగ్గరకు తీసుకుని సేద తీర్చేది. తాను ఆమె ఒడిలో తల పెట్టి పడుకుని సర్వలోకాలను మర్చిపోయేవాడిని కాదా ? అని అనిపించింది. అలా అనిపించే సరికి భార్య మీద మరింతగా అసహనం పెరిగింది. ఈమెకు నేనంటే ఖాతరు లేదు. నా సంపాదనే ఆమెకు ముఖ్యం అని అనుకున్నాడు. అందుకే పెళ్ళాం జేబు చూస్తుందని అంటారు. సిగరెట్ కాలుస్తూ గదిలో పచార్లు చేస్తూ ఆలోచించసాగాడు.

పెళ్ళి చేసుకున్న తర్వాత దాదాపుఆరేళ్ళు సాఫీగానే గడిచినట్లనిపించింది. మంచి ఉద్యోగం, కొద్దిగా బ్యాంక్ బ్యాలెన్స్, కాన్వెంట్‌లో చదివే ఇద్దరు మగపిల్లలు - జీవితం దాదాపు ఏ ఒడిదొడుకులు లేకుండా సాగిపోతుంది.

మూడు రోజుల క్రితం ఊహించని సంఘటన జరిగింది. ఎయిర్ కండిషన్డ్ హోటల్లో కాఫీ తాగి బయటికి వస్తుంటే తనను మెట్ల మీదే అపేసి 'బాగున్నారా ?" అని అడిగింది ఒక స్త్రీ. తాను ఆమెను గుర్తించలేకపోయాడు. గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నంలో ఆమెకు సమాధానం ఇవ్వలేదు.

"నన్ను గుర్తించలేదు కదూ!" అంది.

వేణు మాట్లాడలేదు.

"గుర్తించలేదు లెండి. నిన్ననా, మొన్ననా, ఆరేళ్ళ కిందటి మాట" అంది. గుర్తించలేకపోయానని అంగీకరించడానికి చాలా సిగ్గుపడ్డాడు. నడి వయస్సు స్త్రీ. చూస్తుంటే చూడాలనిపించే విగ్రహం.

"గుర్తుపట్టారా?" అడిగింది.

లేదని తలూపాడు.

ఒక స్త్రీ తనకు ఎదురుపడి 'నన్ను గుర్తుపట్టారా?' అని అడిగితే 'గుర్తుపట్టలేద'ని చెప్పడం అతనికి నామోషీ అనిపించింది.

"నేనే చెప్తా. ముందు కాఫీ తాగుదాం, రండి!" అని ముందుకు కదిలింది. అతను వెనుదిరిగి ఆమె వెంట నడిచాడు.

హోటల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. 'మీరేం మారలేదు' అంది. 'అయినా మగవాళ్లలో మార్పు కనిపించదు లెండి' అంది.

ఆరేళ్ల కింద మీరు నా అడ్రస్ తీసుకున్నారు. మీరు

తప్పకుండా వస్తారని చూశాను. కానీ రాలేదు' అంది.

'గుర్తు రాలేదా?' అని అడిగింది. అతను గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాడు.

'చిన్న కలయిక ఎట్లా గుర్తుంటుంది, లెండి' అని ఆమే సర్ది చెప్పుకుంది.

'ఎక్కడ కలిశాం?' అని అడగబోయి బాగుండదని ఊరుకున్నాడు.

'కలుస్తానని చెప్పి ఆర్ట్స్ కాలేజీ మెట్లమీద నా అడ్రస్ తీసుకున్నారు' అని గుర్తుకు తెచ్చేందుకు ఒక సూచన ఇచ్చింది. లీలగా గుర్తొచ్చింది. 'వీణ కాదు కదా!' అనే అనుమానం వచ్చింది. అనుమాన నివృత్తి కోసం అడుగుదామనుకున్నాడు. కానీ మొహమాటం అడ్డువచ్చింది. ఏమీ మాట్లాడలేదు. ఆమే టీకి ఆర్డరిచ్చింది. టీ రాగానే సిప్ చేస్తూ వేణు వైపు పరిశీలనగా చూసింది. 'మీరేం మారలేదు' అంది.

అక్కడక్కడ తల వెంట్రుకలు తెల్లబడ్డాయి. కాస్త బొర్ర పెరిగింది. అయినా ఏమీ మారలేదంటుందేమీ? అని అనుకున్నాడు. ఆమె తనను ఎగతాళి చేస్తుందేమోనని అనుమానం వచ్చింది. తన ఆలోచనను పసిగట్టినట్లే- 'నేనేం జోక్ చేయడం లేదు. నిజంగా మీరు మారలేదు. పదో తరగతిలో మీరు ఎట్లా ఉన్నారో ఇపుడూ అట్లే ఉన్నారు' అంది. అపుడు గుర్తు పట్టగలిగాడు. ఒక్కసారిగా పోగొట్టుకున్న ఆత్మ ఏదో రెక్కలొచ్చి తనలో తిరిగి ప్రవేశించినట్లు ఫీలయ్యాడు. 'మీరు......' అని నసుగుతున్నాడో లేదో 'అవును, నేను వీణనే' అంది.

'ఎక్కడుంటున్నారు?' అని అడిగాడు.

'మీరు ఒకటి అడగాలనుకుని మరొకటి అడిగారు' అంది తన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా.

'నేనేం అడగాలనుకున్నా?' అని ప్రశ్నించాడు.

'మీకు పెళ్లయిందా, పిల్లలున్నారా? అని అడగలేక ఆ ప్రశ్న వేశారు' అంది.

'అయితే దీనికే జవాబు చెప్పండి' అని అడిగాడు.

'డజను మంది పిల్లలు. మా వారు ఓ ప్రభుత్వ బ్యాంక్‌లో పెద్ద ఆఫీసరు, సరేనా?' అంది.

వేణు కాస్త నిరుత్సాహపడ్డాడు. ఆమెకు పెళ్లి కాకుండా ఉంటే బాగుండును అని అనుకున్నాడు. ఆమెకు పెళ్లి కాకపోతే ఏం చేసేవాడు? భార్యను వదిలేసి ఈమెతో వెళ్లి పోయేవాడా? అదే ప్రశ్న అతనూ వేసుకున్నాడు అంతరంగంలో. సమాధానం రాలేదు. మరెందుకు తనకు అలా అనిపించింది అని కూడా శోధించుకున్నాడు. దీనికి కూడా జవాబు రాలేదు. 'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అని అడిగింది. ఏమీ లేదని చెప్పాడు. 'ఏమీ లేకుండా ఎట్లా ఉంటుంది? ఈమెకు పెళ్లికాకపోతే బాగుండుననుకుంటున్నారు కదూ?' అంది. దాంతో వేణు గుండె ఆగిపోయినంత పనయింది. ఏమీ మాట్లాడలేదు.

'అయినా ఫరవాలేదు. మీరు ఎపుడయినా మా ఇంటికి రావచ్చు' అంది.

అడ్రస్ అడగబోయి వెనక్కి తగ్గాడు. హ్యాండ్ బ్యాగ్ లోంచి విజిటింగ్ కార్డు తీసి అతనికిచ్చింది. దాన్ని తీసుకుని చూడకుండానే జేబులో పెట్టేసుకున్నాడు.

'వెళ్దామా?' అంటూ లేచింది.

'సరే' అంటూ అతనూ లేచాడు. కానీ అతనికి కదలాలనిపించలేదు. ఇంకాసేపు కూర్చుంటే బాగుండుననుకున్నాడు.

అతని ఆలోచనను చదివేసినట్లే- 'ఇంకాసేపు కూర్చోవాలని నాకూ ఉంది. కానీ నాకు అర్జంట్ పని ఉంది' అని అంటూ బయటకు నడిచింది.

** * **

విషాదవదనుడై వేణు గదిలో పచార్లు చేయసాగాడు. పిల్లలిద్దరూ- మగవాళ్లే. ముందు గదిలో టీవి చూస్తున్నారు. భార్య వంటగదిలో కుస్తీ పడుతోంది. తన బాధను ఎవరితోనూ పంచుకోలేదు. ఆ అగ్నిపర్వతం తనలోనే రగలాలి. ఎందుకట్లా అయింది? వీణ ఏమైంది? అంతా కలలో మాదిరిగా జరిగిపోయింది.

తానింత కాలం మనిషిగానే బతికున్నానా అని అనిపించింది. మనస్సు శిల చేసుకుని జీవించాను కావచ్చుననుకున్నాడు. తానిది వరకు రెండుసార్లు కలుద్దామనుకుని వీణను ఎందుకు కలువలేదు? ఆమె రమ్మని చెప్పినా తానెందుకు వెళ్ళలేదు? యాంత్రికతలో రాజీపడడానికే తాను అలవాటుపడ్డానా? అని ప్రశ్నించుకున్నాడు. తానెందుకు వీణను అర్థం చేసుకోలేకపోయాడు? అసలు 'నన్ను నేనే అర్థం చేసుకోలేదేమోనని' అనుకున్నాడు. గత మూడు రోజులుగా గుండెలో మంటలు లేస్తున్నాయి.

ఆ రోజు మధ్యాహ్నం పబ్లిక్ గార్డెన్స్‌లోంచి బయటకు వస్తుంటే ఆమె ఎదురుపడింది.

'ఏమిటి, చిక్కిపోయారు?' అని అడిగింది. తాను గుర్తుపట్టలేదు. అయోమయంగా చూశాడు.

'నన్ను గుర్తుపట్టలేదు, కదూ?' అని అడిగింది. తాను మాట్లాడలేదు.

'ఇరవై ఏళ్ళవుతోంది, ఏం గుర్తుపట్టగలరు?' అంది.

వేణు మనస్సులో గత జ్ఞాపకాల నీడలు కదలాడాయి. 'వీణ కాదు కదా!' అని అనుకున్నాడు. సందేహం తీర్చుకుందామనుకుని ఆగిపోయాడు. 'ఎప్పుడూ తాను అంటే, మొహమాటం ఎక్కువ. వీణనో, కాదో తేల్చుకుంటే అయిపోతుంది కదా!" అని అనుకున్నాడు.

"మీరేం సందేహించనక్కర్లేదు. నేను వీణనే" అంది.

"సందేహాన్ని తీర్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదు' అని అనుకున్నాడు. ఈ సంభాషణ జరుగుతుండగానే అసెంబ్లీకి ఇవతల పెట్టిన బ్యారికేడ్లవద్ద కలకలం మొదలైంది. విద్యార్థులు నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసేసి పోలీసుల వలయాన్ని ఛేదించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఏం మాట్లాడాలో తోచలేదు వేణుకు. 'పిల్లలతో వచ్చారా?' అని అడిగాడు.

'పిల్లలు లేరు. గిల్లలు లేరు' అని గలగలా నవ్వింది. ముఖంలో విచారం అలుముకుంది. ఆమె ముఖం మబ్బులు కమ్మేసిన చంద్రుడిలా అనిపించింది వేణుకు.

"ఎందుకు చేసుకోలేదు?" ప్రశ్నించాడు.

"నాకిష్టమైన వాడి కోసం నిరీక్షిస్తూ గడిపేశాను" అంది.

'అతను రానే లేదా?' అని అడిగాడు.

"రాలేదు"

"ఎందుకు?"

"ఏమో, తెలియదు"

బయట గొడవ మరింత పెరిగినట్లుంది. ఒకరి మాటలు ఒకరికి అస్పష్టంగానే వినిపిస్తున్నా స్పష్టంగానే అర్థమవుతోంది. ఆ ఇద్దరు కూడా బయటి కలకలాన్ని పట్టించుకోవడం లేదు.

"అతనికి పెళ్ళయిందా?"

"నేనడగలేదు. అతనికి పెళ్ళి కావడం కాకపోవడం నాకు ముఖ్యమనిపించలేదు. ఆ విషయం తెలుసుకోవాల్సిన అవసరం కూడా నాకు కనిపించలేదు. నా దగ్గరకు వస్తే చాలనుకున్నాను. ఒక్కసారి వచ్చినా నా మనస్సు తృప్తిపడేది". అంది. ఆమె అలా మాట్లాడుతున్నపుడు ఎటో శూన్యంలోకి చూస్తూ ఒక్కొక్క మాటే వెతుక్కుంటూ చెబుతున్నట్లనిపించింది.

పోలీసులు విద్యార్థులను లాఠీలతో తోయసాగారు. విద్యార్థులను వెనక్కి తరమడానికి లాఠీలను రోడ్డు మీద ఝళిపించసాగారు. దీంతో విద్యార్థులు ఆ ఇద్దరి వైపు వెనక్కి వెనక్కి రాసాగారు.

'అతడికీ విషయం తెలుసా?' అని అడిగాడు. వేణు గొంతు తడారి పోసాగింది. మాటలు పేలవంగా వస్తున్నాయి.

'రెండుసార్లు అడ్రసిచ్చాను. మొదటిసారి అతనే అడ్రస్ అడిగి తీసుకున్నాడు. రెండోసారి నేనే అడ్రసిచ్చా. వస్తాడని ఎంత ఎదురుచూశానో!' ఆమె కళ్ళలో నిరాశ కనిపించింది. అవి దేన్నో వెతుక్కుంటున్నట్టనిపించింది.

వేణుకు ఇక ఏమీ మాట్లాడాలనిపించలేదు. అడగలేక అడిగాడు-"ఎవరతను?" అని.

గొడవ మరింత పెరిగింది. విద్యార్థులకు, పోలీసులకు ఘర్షణ మొదలైంది. పోలీసులు లాఠీచార్జి చేయసాగారు. విద్యార్థులు అడ్డం వచ్చిన వారందర్నీ తోసుకుంటూ గుంపులు గుంపులుగా పరుగెత్తసాగారు. తమ ఇద్దరి వైపు ఓ గుంపు పరుగెత్తిరావడం వేణు గమనించాడు. వెనక్కి వెనక్కి జరగసాగాడు. వీణ కదలలేదు. 'నువ్వే' అని ఆమె నోటి నుంచి వెలువడిన మాట వేణుకు అస్పష్టంగా వినిపించింది. విద్యార్థుల గుంపు వేణును పక్కకు తోసేసి ముందుకు ఉరికింది. పడబోయి నిభాయించుకున్నాడు. పోలీసులు విద్యార్థులను తరుముతూ రావడం చూసి వడివడిగా పక్కకు నడిచిపోయాడు. దాదాపు ఐదు నిముషాలు అక్కడ యుద్ధవాతావరణమే నెలకొంది.

యుద్ధం ముగిసిన తర్వాత రణక్షేత్రంలా ఉంది అక్కడ. జనం లేరు. విద్యార్థులూ లేరు. రోడ్డు మీద పోలీసులే పోలీసులు. చుట్టూ చూశాడు వేణు. వీణ కనిపించలేదు. అటూ, ఇటూ పిచ్చిగా పరిగెత్తాడు. ఎక్కడా కనిపించలేదు. నడిరోడ్డు మీద నిలబడి పిచ్చిగా అరవాలనిపించింది. తనమీద తనకే కోపం ముంచుకొచ్చింది. క్రమంగా నిస్సత్తువ ఆవరించింది. మెల్లగా నడవసాగాడు. ఎటో తెలియదు.

మళ్ళీ బాపు

